క్లుప్తంగా

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మొగల్తూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల దరఖాస్తులను శనివారం రెవెన్యూ సిబ్బంది పరిశీలన చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు సుమారు 2500 దరఖాస్తులు అందాయి. అయితే వీటిలో కొన్ని అటెస్టేషన్ లేకుండా అందించడం, డిగ్రీ పూర్తయి మూడు సంవత్సరాలు పూర్తికాకపోవడం తదితర అభ్యంతరాలను అధికారులు గుర్తించారు. దీంతో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు సంబంధిత దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి సరైన వివరాలను అందించాలని కోరారు. అన్ని సవ్యంగా ఉన్న దరఖాస్తులను ఆమోదించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

మొగల్తూరు: మొగల్తూరు కేతకీపుర సామ్రాజ్య శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం మూడో శనివారం రోజున గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గంగ పవన్ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనానంతరం ఆల య ఆవరణ అన్న ప్రసాదాన్ని అందించారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి



పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

పెనుగొండ: బాలల చట్టాలు, హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు జి.సుజాత అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా శనివారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ ఎస్కేవీఆర్ బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలకు బాలల హక్కులపై, బాల్య వివాహ నిషేధ చట్టం -2006, పోక్సో చట్టం 2012పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఎస్ సీహెచ్ విజయ సత్యవతి, సోషల్ వర్కర్ కె.స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమలాపురం నుంచి అప్పనపల్లికి పాదయాత్ర

పెనుగొండ: హిందూ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆచంట మండలం వల్లూరు, భీమలాపురం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కోలాట భజన మండళ్ల సభ్యులు అప్పనపల్లికి పాదయాత్ర ప్రారంభించారు. శనివారం పాదయాత్రను ముఖ్య అతిథిగా పితాని వెంకట్ ప్రారంభించారు. హిందూ సనాతన ధర్మాన్ని పెంపొందించడానికి భక్తులు భారీగా పాదయాత్రలో పాల్గొన్నారని సర్పంచ్‌లు తెలిపారు. అప్పనపల్లివరకూ పాదయాత్ర నిర్వహించి, కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి దర్శించుకుంటమాని స్పష్టం చేశారు.

మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం లేకుండా పోయింది. నాలుగేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో అట్టహాసంగా నిర్వహించారు. పలు దఫాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. దూడలు తినేయడం, నీళ్లు వేయడం లాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు చచ్చిపోయాయి. స్వాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోనే మొక్కలకు నీళ్లుపోసేవారు లేక ఎండిపోతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: భర్త వేధింపులపై ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నెహ్రూకాలనీకి చెందిన పెచ్చెటి లీలామనోహర్‌తో పద్మలతకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భర్త తన బాగోగులు పట్టించుకోకుండా వేధిస్తున్నాడని, ఇందుకు మరో ఇద్దరు సహకరిస్తున్నారని పోలీసులను ఆశ్రయించింది.

ఉచిత ఇసుక ఎక్కడ?

- పేద, మధ్య తరగతి ప్రజలకు తప్పని అవస్థలు
- ఉపాధి కోల్పోతున్న భవన నిర్మాణ కార్మికులు



ఇసుక లేక నరసాపురంలో ఆగిన భవన నిర్మాణం

నరసాపురం రూరల్: నియోజకవర్గంలో ఇసుక బంగారంలా మారింది. ఉచిత ఇసుక అంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు పేరుతో అసలు ఇసుకను అందుబాటులో లేకుండా చేసింది నిర్మాణదారులు వాపోతున్నారు. ఉచితంగా కాకపోయినా డబ్బిచ్చి కొనుక్కుందామన్నా దొరక్కపోవడంతో ఇసుక కోసం గృహ నిర్మాణ దారులు అవస్థలు పడుతున్నారు. ఇసుక లభించకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు సైతం పనులు లేక పస్తులుండాల్సిన పరిస్థితి దాపురించింది. వేల రూపాయలు వెచ్చించినా ఇసుక దొరక్కపోవడంతో భవన నిర్మాణదారులు బేల చూపులు చూస్తున్నారు. అదే సమయంలో అధికార పార్టీ నాయకులు మాత్రం ఇసుకను యథేచ్ఛగా అక్రమంగా బడా నిర్మాణదారులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న ప్రజలు మాత్రం కూటమి నాయకుల తీరుపై నిప్పులు చెరుగుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ముందస్తు చర్యలు

సాధారణంగా వర్షాకాలంలో గోదావరికి వరద పోటెత్తుతుంది. అందువల్ల ముందుగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్టాక్ పాయింట్స్ ఏర్పాటు చేసి ఇసుకను నిల్వ చేసేది. ఇలా నిల్వ చేసిన ఇసుకను పేద, మధ్యతరగతి నిర్మాణదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేసేవారు. ఉచిత ఇసుక పేరుతో ఆ వ్యవస్థను తీసేసిన కూటమి సర్కార్ నిర్వాకం వల్ల నరసాపురం ప్రాంతంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోనూ, మొగల్తూరు మండలంలోనూ వందలాది భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రైవేటు భవనాలతో పాటు ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలపైనా ఇసుక కొరత ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగా ఇళ్లు నిర్మించుకుందామనుకున్న వెనుకడుగు వేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో సేవలు నిల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకూ ఇసుక విక్రయానికి సంబంధించి శాశ్వత విధానాన్ని అమలు చేయలేదు. నూతన మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవాలంటే అవస్థలు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక నిల్వలు లేవని చూపుతుండటంతో ఇసుక బుకింగ్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇసుకకు సంబంధించి ఎలాంటి ఇబ్బంది లేకుండా స్టాకు పాయింట్లలో ఇసుకను నిల్వ ఉంచగా అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి నాయకులు మూడొంతుల ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. స్టాకు పాయింట్లు ఏర్పాటు చేశామని చెబుతున్నప్పటికీ నరసాపురం ప్రాంతంలో ఇసుక బుక్ చేసుకునేందుకు సచివాలయాలకు వెళ్లిన వారెవరికీ ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ జరిగిన దాఖలాలు లేవు. గత శనివారం నరసాపురంలో ఇసుక ర్యాంపును తెరిపించండి అంటూ నరసాపురం ట్రాక్టర్స్ యూనియన్, బోట్స్‌మెన్ సొసైటీ యూనియన్‌లు సంయుక్తంగా ఆర్డీఓ దాసి రాజును కలసి నరసాపురంలో ఇసుక ర్యాంపును తెరిపించి దీనిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తమ గోడు వెళ్ల బోసుకున్నా ఫలితం లేదు.

ఇంటి నిర్మాణం నిలిచిపోయింది



ఇసుక దొరక్కపోవడంతో మూడు నెలలుగా ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోమని చెప్పడంతో మా పరిధిలో ఉన్న సచివాలయానికి పలు మార్లు వెళ్లినా ఆన్‌లైన్ ముందుకు సాగడం లేదని, నో స్టాకు అని వస్తుందని చెబుతున్నారు. ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చిస్తే దొరుకుతుందని దళారులు చెబుతున్నారు.

– యాతం శ్రీనివాసరావు, నరసాపురం

ఓట్లు మావి..పదవులు మీకా?

పెనుగొండ: బహుజన కులాల ఓట్లతో గద్దెనెక్కి అధికారం వచ్చిన అనంతరం ఒకే కులానికి ప్రధానమైన పదవులు, మొక్కుబడిగా బహుజన కులాలకు అప్రాధాన్య పదవులు ఇవ్వడం న్యాయమా? అని బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ కూటమిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక న్యాయమంటూ అధికారంలోకి వచ్చి ఇపుడు ఒకే కులానికి పదువులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు రబ్బరు చెప్పులు వేసుకున్నవారితో రాజకీయాలు చేయిస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించి, కార్పొరేట్ భావజాలంతో బలహీన వర్గాలపై ఆరెస్సెస్ ఎజెండా అమలు చేస్తున్నారని మండిపడ్డారరు. ఇప్పటికైనా బహుజన కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దుప్పట్లు, నిత్యావసరాల పంపిణీ

పెనుగొండ: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం పెనుగొండ జూపిటర్ మాస్టర్ మైండ్ స్కూలు వద్ద లయన్స్ అధ్యక్షుడు జక్కంవిజయ్‌కుమార్ సుమారు 50 మందికి అన్నదానం చేసి, వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



నరసాపురం: గ్రంథాలయ పితామహులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కొప్పర్రు గ్రామస్తులు

నరసాపురం: పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం మూడవరోజు గ్రంథాలయ ఉద్యమ పితామహుడు రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణల సంస్మరణ సభ నిర్వహించారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి సలాది రామారావు, ఉపాధ్యాయులు మాడభూషి కృష్ణప్రసాద్, రిటైర్డ్ శాస్త్రవేత్త ఆర్ సుబ్బారావులు ముఖ్య అతిథులుహాజరయ్యారు. గ్రంథాలయ ఉద్యమ పితాముహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి వారు చేసిన కృషిని వివరించారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కేజేఎస్‌ఎల్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రులో

నరసాపురం రూరల్: నిత్యం చదవడంవల్లే విజ్ఞానం పెరుగుతుందని అందుకు గ్రంథాలయాలు పూలబాటలు వేస్తాయని గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి రమేష్ అన్నారు. కొప్పర్రు పుస్తక పంపిణీ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రచయిత, సాహిత్య వేత్త డాక్టర్ నూజిళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజలు ఆదరించాలని, పుస్తకాలే జీవితమనే విషయాన్ని ఎవరూ మరవకూడదన్నారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అలాగే గ్రంథాలయాలకు వచ్చే అలవాటును తల్లిదండ్రులు అలవాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూజిళ్ల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. బాలల దినోత్సవం, గ్రంథాలయ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు దివంగత కుంకటి నాని కుటుంబ సభ్యులు సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి గోపాలకృష్ణ గోఖలే, పోలిశెట్టి శ్రీనివాస్, చినమిల్లి వీరబాబు, బాబు, మధు, కొండ, నూకల రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల సంక్షేమానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి విజయదుర్గ

నరసాపురం: సమాజంలో మానసిక వికలాంగుల సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అన్నారు. శనివారం జడ్జి పట్టణంలోని పీచుపాలెంలోని కల్యాణి మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో మానసిక వికలాంగులకు అందిస్తున్న శిక్షణలను పరిశీలించారు. వారు కంప్యూటర్‌లను వినియోగిస్తున్న తీరును పరిశీలించి కేంద్రం నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేంద్రంలోని మానసిక వికలాంగులకు చెవి, గొంతు, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో కళ్యాణి రిహేబిలిటేషన్ సెంటర్ కార్యదర్శి అల్లూరి నళినిదేవి, కరస్పాండెంట్ బాబూరావు, రాయల్స్ క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుంకర రమేష్, రోటరీక్లబ్ అధ్యక్షురాలు జి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో రీ-సర్వే గ్రామసభ



రీ-సర్వే గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ ఏలిషా

మొగల్తూరు: తమ గ్రామంలో అనేక భూ సమస్యలున్నాయని వాటిని పరిష్కరించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సర్పంచ్ బందెల ఎలిషా సూచించారు. శనివారం రామన్నపాలెం పంచాయతీ 1వ సచివాలయ పరిధిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో సరిహద్దు సమస్యలు, పేర్లు మార్పిడి, భూ సమస్యలు అనేకం ఉన్నాయని, ప్రజలు తమ ఫిర్యాదులను లిఖితపూర్వకంగా అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. దీనిపై సర్వేయర్ డీటీ నాగేశ్వరరావు మాట్లాడుతూ భూములకు సంబంధించిన లింక్ దస్తావేజులకు మీ ఫిర్యాదులకు జత చేసి అందిస్తే సమస్యను పరిశీలిస్తామన్నారు. ఈ గ్రామ సభలో ఉపసర్పంచ్ మేకల పరుశురామ్, ఎంపీటీసీ సభ్యురాలు అయితం ధనలక్ష్మి, అయితం బాబులు, సర్వేయర్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ వాడకాన్ని అరికట్టేవారేరి?



పాలిథీన్ కవర్లో వేడి టీ ప్యాక్ చేస్తున్న విక్రయదారుడు



పాలిథీన్ కవర్లో ప్యాక్ చేసిన సాంబారు

యలమంచిలి: పాలిథిన్ కవర్లు వాడకం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నా వాటిని అరికట్టడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. ఏటా పాలిథిన్ కవర్ల వినియోగం పెరుగుతుండటతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పాలిథిన్ కవర్ల వినియోగంపై నిషేధం ఉన్నా అధికారుల ఉదాసీనత వల్ల మార్కెట్‌లో కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వీటి వాడకం ఏ స్థాయికి చేరిందంటే టీ సెంటర్లలో టీ, కాఫీ హోటల్స్, కూరల విక్రయాల కేంద్రాల్లో సాంబారు వంటి వేడి వేడి ద్రవపథార్థాలు సైతం పలుచటి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. జ్యూస్ సెంటర్లలో కూడా అతి చల్లని జ్యూస్‌లను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి ఇస్తున్నారు. ఈ విధంగా అతి చల్లని, అతి వేడి పదార్థాలు పలుచటి పాలిథిన్ కవర్లలో వేయడం వలన ప్లాస్టిక్ కరిగి ఈ ఆహార పదార్థాలలో చేరుతుంది. వాటిని తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

అధికారుల ఉదాసీనత.

దశాబ్ద కాలం క్రితం పాలిథిన్ కవర్ల వాడకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేదం విధించాయి. ఆ సమయంలో అధికారులు దాడులు చేసి పట్టుకుని అపరాధ రుసుం విధించేవారు. దీంతో చాలామంది దుకాణాల యజమానులు తమ దుకాణాల వద్ద పాలిథిన్ కవర్లు ఇవ్వము అనే బోర్డు పెట్టేవారు. అదే సమయంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు క్లాత్ సంచులు పంపిణీ చేశాయి. కాలక్రమేణ అటు అధికారుల్లోనూ, ఇటు దుకాణాల యజమానుల్లోనూ ఉదాసీన రావడంతో పాలిథిన్ కవర్ల వినియోగం పూర్వ స్థితికి చేరుకుంది.

ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు

పాలిథిన్ కవర్ల వినియోగం వలన ఇటు మానవుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా అటు పర్యావరణం దెబ్బతింటుంది. పాలిథిన్ మితమీరి వాడడం వల్ల వాటి మలినాలు మానవ శరీరంలో చేరి అనేక ప్రాణాంతక రోగాలను కలుగజేస్తున్నాయి. ఆహార పదార్థాలు తిని పాడేసిన కవర్ల నుంచి వచ్చే వాసనను పసిగట్టి ఆవులు, గేదెలు, కుక్కలు వంటి జంతువులు కవర్లతో వాటిని తింటున్నాయి. దీంతో వాటికి జీర్ణకోశ వ్యాధులు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి. వాడి పడేసిన పాలిథిన్ కవర్లు మట్టిలో కరగకపోవడం వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. మురుగు కాలువలు, పంట కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. ఇన్ని అనర్థాలకు కారణమవుతున్న పాలిథిన్ కవర్ల వాడకాన్ని కఠినంగా అరికట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రోటరీ సభ్యులు

పాలకొల్లు అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఉల్లంపర్రు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీల్లో పరుగు, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, రోటరీ పోలియో రీజినల్ డిస్ట్రిక్ట్ చైర్మన్ మద్దాల వాసు, క్లబ్ కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌గ్రూపు నిర్ధారణ పరీక్షలు



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: రూరల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నాగరాజుపేట గురుకుల విద్యాలయంలో 9, 10 తరగతి విద్యార్థులకు శనివారం బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు శ్రీధర్ పర్యవేక్షణలో సుమారు 150 మంది విద్యార్థులకు గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ గొర్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గణేశ్వర మహాపాత్ర, రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సాలన సుబ్బారావు, కుక్కల అజయ్‌కుమార్, కోశాధికారి గోటేటి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

పిచ్చి రాతలతో నంబర్ ప్లేట్లు



అసలు బైక్ నంబరే లేని నంబర్ ప్లేట్



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నంబర్ ప్లేట్

యలమంచిలి: బైక్‌ల మీద ఉండే నంబర్ ప్లేట్‌పై నంబరు స్పష్టంగా కనిపించాలి. నంబర్ ప్లేట్‌పై ఎటువంటి స్లోగన్స్ గానీ, కొటేషన్స్ గానీ ఉండకూడదని మోటార్ వెహికల్స్ యాక్టులో స్పష్టంగా ఉంది. అయితే కొందరు ప్రబుద్ధులు తమ బైక్‌ల నంబర్ ప్లేట్స్‌పై ఇష్టానుసారంగా రాతలు రాస్తున్నా పట్టించుకునే నాథుడే ఉండటం లేదు. కొందరు స్లోగన్స్ పెద్దగా రాసి నంబర్ చిన్నగా వేయిస్తుంటే, మరి కొందరు అసలు నంబరే లేకుండా కొటేషన్స్ మాత్రమే నంబర్ ప్లేట్‌పై రాసి యథేచ్ఛగా తిరిగేస్తున్నారు. పలు రాజకీయ పార్టీలకు చెందిన పేర్లు, నాయకులు పేర్లు, సినిమా హీరోల పేర్లతో కూడా నంబర్ పేట్స్ కనిపిస్తున్నాయి. నంబర్ ప్లేట్స్ మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం 2017 నుంచి వచ్చే అన్ని రకాల బైక్‌లకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్స్ ఉండాలని నిబంధన ఉంది. నంబర్ ప్లేట్స్‌పై నిబంధనలకు విరుద్ధంగా స్లోగన్స్ రాస్తే రూ.100 జరిమానా విధించడంతోపాటు, ఆ నంబర్ ప్లేట్ స్థానంలో కొత్త హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ బిగించేలా చర్యలు తీసుకోవాలి. అయితే ఆర్‌టీఏ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో యువకులు ఇష్టానుసారంగా పిచ్చి రాతలతో నంబర్ ప్లేట్స్ బిగించుకుని తిరుగుతున్నారు.

నేడు పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్ఎస్ ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో వెబ్ సెమినార్



వెబ్ సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: ఆన్‌లైన్ సెమినార్‌ల వల్ల మేథో సంపత్తి హక్కులపై అవగాహన కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థ శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మేథో సంపత్తి హక్కులు అనే అంశంపై జాతీయస్థాయి వెబినార్ (ఆన్‌లైన్ సెమినార్) నిర్వహించారు. ఈ సందర్భంగా వెబ్ సెమినార్ రిసోర్స్ పర్సన్స్ సుస్మిత రాహుల్ బట్నాసే మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కులు అనేవి స్టార్ట్ అప్, ఎంటర్‌పిన్యూర్‌షిప్ అభివృద్ధికి, అలాగే దేశాభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు కె.భద్రాచలం, డాక్టర్ వి.విజయలక్ష్మి, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.